జంక్షన్.. జిగేల్..

- రూ.55 లక్షల వ్యయంతో 'స్కల్ప్చర్ ఏర్పాటు
- రూపురేఖలు మారనున్న 'త్రీ వే' నల్లగండ్ల జంక్షన్

శేరిలింగంపల్లి: జంక్షన్ల సుందరీకరణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లో ఇటీవలే పలు జంక్షన్లలో బ్యూటిఫికేషన్ల పనులు పూర్తి చేశారు. దీంతో వాటి రూపురేఖలు మారిపోయాయి. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లలో నాలుగు జంక్షన్ల సుందరీకరణ పనులు చేపట్టారు. అందులో భాగంగానే గచ్చిబౌలి డివిజన్ పరిధి నల్లగండ్లలోని 'త్రీ వే' జంక్షన్ సుందరీకరణ పనులకు ఇటీవలే శ్రీకారం చుట్టారు. అందుకు అవసరమైన పనులను మొదలుపెట్టారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తేవాలని అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది.


నల్లగండ్ల త్రీ వే జంక్షన్‌లో జరుగుతున్న బ్యూటిఫికేషన్ పనులు

రూ.55 లక్షల వ్యయంతో నిర్మాణం

జీహెచ్ఎంసీ రూ.55 లక్షల వ్యయంతో నల్లగండ్లలోని త్రీ వే జంక్షన్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. శిల్పం, వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. దీంతో ఈ జంక్షన్ ఆకర్షణీయంగా మారనుంది.

ట్రాఫిక్ రద్దీ పెరిగిన నేపథ్యంలో కూడలి సుందరీకరణ..

నల్లగండ్ల త్రీ వే జంక్షన్ రద్దీ పెరిగిపోతోంది. ఇంకా భవిష్యత్తులో మరిన్ని అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉండడంతో మరింత రద్దీ పెరిగే అవకాశం ఉంది.


నమూనా చిత్రం

ముఖ్యంగా నల్లగండ్ల, గోపన్‌పల్లి,తెల్లాపూర్ మూడు రూట్లకు వెళ్ళే రహదారుల కూడలి కావడంతో నిత్యం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ద్విచక్ర వాహనాలు, కార్లు, భారీ వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. దీంతో జంక్షన్ సుందరీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రశాంత్‌నగర్, కొండాపూర్, జూబ్లీగార్డెన్, భిక్షపతినగర్, గోల్డెన్ తులీప్, రాఘవేంద్ర కాలనీ ఏ.బీ.సీ బ్లాక్‌లు, రాజరాజేశ్వరీ కాలనీ, హనుమాన్‌నగర్, సైబర్ వ్యాలీ, గోపాల్‌రెడ్డి నగర్, అపర్ణ, హఫీజ్‌పేట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చందానగర్‌లో..

చందానగర్ : హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

◆ మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 3.00 వరకు జనప్రియ డి బ్లాక్, దేవిహోమ్స్, కుమ్మరి బస్తీ, సాయిరాం నగర్, ఓల్డ్ హఫీజ్‌పేట్, నిఖిల్ సాయి అపార్ట్‌మెంట్స్, హెచ్‌పీఆర్ హోమ్స్, ఎన్‌డ్కో బిల్డర్స్, అపర్ణ విల్లాస్, డబుల్ బెడ్‌రూమ్స్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో...

భిక్షపతి ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు కైలాష్‌నగర్, టెక్నో అపార్ట్‌మెంట్స్, జవహర్ నగర్ రోడ్ నెంబర్ 4,5,6, శ్రీదేవి థియేటర్ ఎదురు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

శ్యాంలెట్ వీధిలో ఇంటికో డప్పు పంపిణీ

రాయదుర్గం: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపుపై చలో హైదరాబాద్ కార్యక్రమం కోసం ఇంటికో డప్పును పంపిణీ చేయనున్నారు. అందుకోసం గురువారం సికింద్రాబాద్‌లో డప్పులను కొనుగోలు చేసి వాటిని స్థానిక శ్యాంలెట్ వీధిలోని ఇంటింటికీ ఒక డప్పును పంపిణీ చేయనున్నట్లు ఎంఆర్‌పీఎస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి గణేష్ తెలిపారు. ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ కార్యక్రమంలో ప్రతి ఇంటి నుంచి ఒకరు విధిగా డప్పు తీసుకొని సమావేశానికి రావాలని మందకృష్ణ మాదిగ ఆదేశంపై డప్పులు కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నరేష్, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


చిత్రలేఖన పోటీలు



మహా కుంభమేళాపై గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్ కేంద్రీయ విద్యాలయలో గురువారం 6,7,8 తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ జితేందర్‌కుమార్ ,ఆర్ట్ టీచర్ శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విద్యార్థులు మహా కుంభమేళా వైభవాన్ని, ఆధ్యాత్మికత, సంస్కృతిని కళ్లకు కట్టినట్టు చూపారు. చిత్రాలు ఆకట్టుకున్నాయి. –రాయదుర్గం







నేడు శంకుస్థాపన

శేరిలింగంపల్లి: నల్లగండ్ల చెరువు అలుగు నుంచి భెల్ చౌరస్తా గ్యాస్ గోడౌన్ వరకు ఉన్న నాలాకు ఆర్‌సీసీ బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు. రూ. 28.45 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బాక్స్‌డ్రైన్ పనులకు కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూట్రిషన్ కిట్‌లు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం దాత సహకారంతో రోగులకు న్యూట్రిషన్ కిట్‌లను పంపిణీ చేశారు. అనంతరం డా.ఆదిత్య ఆధ్వర్యంలో టీబీ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు.

మందుబాబులకు జరిమానా, జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 9 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ.2 వేలు జరిమానా, ముగ్గురికి రూ. 1500 జరిమాన, మరో ఇద్దరికి రూ. 1000 జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



రాయదుర్గం: నానక్‌రాంగూడలోని మహాకాళేశ్వరస్వామి ఆలయంలో గురువారం పార్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ప్రారంభించారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలను ప్రధాన అర్చకులు కృష్ణశర్మ, జోగిందర్ శర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గంటా కార్తీక్, ముత్యంరెడ్డి, నర్సింహారెడ్డి, శేఖర్ పటేల్, భక్తులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే గాంధీ


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన మల్లారెడ్డికి రూ.4.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును గురువారం ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆర్థిక స్థోమత లేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఎండీ ఇబ్రహీం, సత్యం గుప్తా, అంకరావు, అమర్, కరుణాకర్, హరికృష్ణ, కరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీ విద్యాంజలి హైస్కూల్‌లో గురువారం భారత్ వికాస్ పరిషత్ నమో గంగా ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్‌సీయూ రిజిస్ట్రార్ దేవేశ్ నిగమ్, బీవీపీ జాతీయ ఉపాధ్యక్షులు సునీల్ ఖేరాలు హాజరై మెడికల్ టెస్టింగ్ వ్యాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య పరీక్షలు విద్యార్థుల ఆరోగ్య వివరాలను తెలుసుకోవడానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా నారెళ్ళ మాల్యాద్రి, బీవీపీ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు సతీష్, నమో గంగా అధ్యక్షులు ఎల్.నర్సింహారెడ్డి, స్కూల్ వ్యవస్థాపకులు ఎల్.వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బాలత్రిపుర సుందరి తదితరులు పాల్గొన్నారు.


మెడికల్ టెస్టింగ్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ దేవేశ్ నిగమ్, సునీల్ ఖేరా

జాతిపితకు ఘన నివాళి

రాయదుర్గం/చందానగర్: జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ఆచరించాలని సైబరాబాద్ సీపీ అవినాశ్‌మహంతి సూచించారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం గచ్చిబౌలి సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) డి జోయల్ డేవిస్, ఏడీసీపీ రవిచందన్‌రెడ్డి, ఎస్‌కే షమీర్, సీఏఓ అకౌంట్స్ వెంకట్‌రెడ్డి, అడ్మిన్ సీఏఓ గీత, జేఏఓ సాయికుమార్, ఇన్‌స్పెక్టర్లు, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.


సైబరాబాద్ కమిషనరేట్‌లో గాంధీజీకి నివాళులర్పిస్తున్న సీపీ అవినాశ్ మహంతి

చందానగర్ సర్కిల్ కార్యాలయంలో..

చందానగర్‌లోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


చందానగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో..

విద్య, వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యం

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

రాయదుర్గం: ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు బి. కోకిల పదవీవిరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులలో మౌలిక వసతుల కల్పనకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. అనంతరం కోకిలను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి, శ్యామల, తాజ్‌బాబు, నాయకులు సురేష్‌గౌడ్, వీణమ్మ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, హన్మంతు, రవీందర్‌రెడ్డి, నరహరి తదితరులు పాల్గొన్నారు.


కోకిల దంపతులను సన్మానిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

నల్లగండ్లలో కోనసీమ (పల్లె) జాతర

ఈనెల 31, ఫిబ్రవరి 1.2 తేదీల్లో ప్రబల తీర్థం వేడుకలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సరోవర్ ప్రబల తీర్థం వేడుకలకు ముస్తాబవుతోంది. 400 ఏళ్ళ చరిత్ర ఉన్న కోనసీమ ప్రబల తీర్థం వేడులకు అపర్ణ సరోవర్ వేదికగా మారుతోంది. ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో వేడుకలు నిర్వహించనున్నారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గన్నతోట వద్ద జరిపే ఈ వేడుకల్లో ఏకాదశ ప్రభలు 11 గ్రామాల నుంచి తరలి వస్తాయి. తీర్థం జరిపిన తరువాత ఆయా గ్రామాలకు తిరిగి వెళ్తాయి. ఏకాదశ రుద్రులను ఒకే చోట చేర్చి పూజిస్తారు. ఈ తీర్థంలో రంగుల రాట్నాలు, చిలక జోస్యం, కుండల తయారీ, వీధి గారడీ, బుజ్జి బూరెలు, పీచు మిఠాయిలతో పాటు చేనేత, హస్తకళల స్టాల్స్ వంటివి ఏర్పాటు చేస్తారు.ఈ ఏడాది దేవర పిట్ట ఆటలను కూడ ప్రవేశపెట్టుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



బీఆర్ఎస్ నాయకుల నిరసన


గాంధీ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మియాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసినందుకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు గురువారం మియాపూర్ మక్తమహబూబ్‌పేట్ గ్రామంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు పూర్తయినా హామీలు అమలు చేయలేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ అధ్యక్షులు కిరణ్ యాదవ్, రోజా, గోపరాజు శ్రీనివాసరావు, శ్రీధర్, చిన్న, రమేష్, సంతోష్, నరసింగరావు, జహంగీర్ తదితరులున్నారు.

హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్

అగ్రస్థానంలో కళింగ వారియర్స్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ హోరాహోరీగా సాగుతోంది. రౌండ్ రౌండ్ కూ టీమ్స్ ఆధిక్యం మారుతూ ప్లే ఆఫ్ రేసును రసవత్తరంగా మార్చేసింది. నాలుగో రౌండ్ లో కళింగ వారియర్స్ టీమ్ అదరగొట్టింది. పూర్తి ఆధిపత్యం కనబరిచి 135 పాయింట్లు స్కోర్ చేసింది. ఆ జట్టు గోల్ఫర్లు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. టీమ్ ట్యూటోరూట్ కూడా సత్తా చాటి 115 పాయింట్లు సాధించింది. ప్రస్తుతం ఓవరాల్ పాయింట్ల పట్టికలో కళింగ వారియర్స్ 625 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. టీమ్ ట్యూటోరూట్ 614 పాయింట్లతో రెండో స్థానంలోనూ , కాంటినెంటల్ వారియర్స్ 608 , మీనాక్షి మావెరిక్స్ 600 పాయింట్లతో మూడు , నాలుగో స్థానంలో కొనసాగుతున్నాయి. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ఫైనల్స్ వియత్నాంలో జరగనున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. రెండవరోజు గురువారం శాకంబరి కామేష్ హరికథతో అలరించారు. వీరికి కె,రాఘవన్ వయోలిన్, వేదాంత్ మృదంగ సంగీత సహకారాన్ని అందించారు. విద్వాన్ తాళ్లూరి నాగరాజు, తాళ్ళూరి లలిత్‌లచే వేణుగాన కచేరీ నిర్వహించారు. విదూషి శ్రీవిద్య అంగర మనోమంథన పేరుతో రూపొందించిన కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

అటకెక్కిన నెక్నాంపూర్ చెరువు అభివృద్ధి

- చెరువును కప్పేసిన గుర్రపుడెక్క
- పరిసర ప్రాంతాల్లో దోమల బెడద

మణికొండ: నెక్నాంపూర్ చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు అటకెక్కాయి. రాజకీయ కారణాలతో కాంట్రాక్టర్ వదిలేయడం ..పాలకుల నిర్లక్ష్యం... అధికారుల అలసత్వం కారణంగా చెరువు వల్ల పరిసర ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. చెరువు కాలుష్యపు కోరల్లో చిక్కుకోవడంతో దుర్గంధం, దోమలతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

◆ ఎగువ ప్రాంతాల్లోని దుర్గం చెరువు, భగీరథ చెరువు, మల్కం చెరువులతో పాటు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల మురుగునీరంతా నెక్నాంపూర్ చెరువులోకి చేరుతుంది. దాంతో చుట్టు పక్కల ఉండే ప్రజలకు దుర్గంధంతో పాటు దోమల బెడద విపరీతంగా ఉంది.

◆ ఈ విషయాన్ని గతంలో ఏకంగా ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయటంతో పాటు పత్రికలు, టీవీలు సమస్యను ఎలుగెత్తి చాటాయి. స్పందించిన అప్పటి పట్టణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వచ్చి ఏకంగా రూ. 22.62 కోట్లతో చెరువును అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. 2018 ఏప్రిల్‌లో పనులను ప్రారంభించారు. ఇక తమ సమస్య తీరిందని స్థానికులు సంబరపడ్డారు. కానీ ఆ పనులు మధ్యలోనే నిలిచిపోవటం, కాంట్రాక్టర్ పత్తాలేకుండా పోవటంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం, రాత్రి అయిందంటే దోమల దండయాత్రతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.



◆ మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ పెద్దచెరువు (ఇబ్రహీంబాగ్)లో కలుస్తున్న మురుగునీటి డైవర్షన్, సుందరీకరణ చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది.

◆ చెరువును జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకుని రూ. 22.62 కోట్ల వ్యయంతో పనులను ప్రారంభించింది. దాదాపు రూ. 10 కోట్ల పనులను చేపట్టిన కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులను ఇవ్వకపోవటంతో అతను పలుమార్లు పనులను నిలిపివేశాడు.

◆ నెక్నాంపూర్ చెరువును తాను దత్తత తీసుకుంటున్నానని, పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఓ పిక్నిక్ స్పాట్‌ను అందిస్తానని అప్పటి, ఇప్పటి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇచ్చిన హామీ అలాగే ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు.

◆ మురుగునీటి డైవర్షన్, చెరువు కట్ట పునఃనిర్మాణం, గుర్రపుడెక్క, సిల్ట్ తొలగింపు పనుల వరకు జరిగి మిగతా పనులు నిలిచిపోయాయి.

◆ మురుగునీటిని శుద్ధి చేసేందుకు చెరువు వద్ద ఎస్‌టీపీ ఏర్పాటు చేసి ఫిల్టర్ చేసే పనులను మొదలు పెట్టలేదు. దాంతో డైవర్ట్ చేసిన మురుగు నీరు కొంత చెరువులో కలుస్తుండగా మిగతాది నేరుగా మూసీ నదిలోకి వెళ్తోంది.

◆ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పార్కులు, సుందరీకరణ పనులు ఆగిపోవడంతో చెరువు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

◆ ఫిబ్రవరి 6వ తేదీ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు నియోజకవర్గానికి రానుండడంతో స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చెరువు దుస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల విజృంభణ

నెక్నాంపూర్ పెద్ద, చిన్న చెరువులలో మురుగు నీరు చేరటం, గుర్రపుడెక్క పెరగటంతో దోమల వ్యాప్తి విపరీతంగా ఉంది. రాత్రి అయిందంటే కంటిమీద కునుకు ఉండడం లేదు. అలకాపూర్ టౌన్‌షిప్‌తో పాటు చెరువు పరీవాహక ప్రాంతంలో ఉన్న అనేక కాలనీల ప్రజలు దోమలు కారణంగా రోగాల బారిన పడుతున్నారు.

– కిరణ్‌కుమార్, అలకాపూర్ టౌన్‌షిప్

డేటా ఎంట్రీ ఆపరేటర్ల నిరసన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో కుల గణన సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈఓ) తమకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వాలంటూ గురువారం సాయంత్రం అధికారులతో వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకి వెళితే.. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో నిర్వహించిన సర్వే వివరాలను ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా డేటా ఎంట్రీ చేసేందుకు 350 మంది వచ్చారు. అయితే ఈ సంస్థ కోనా ఈడే సొల్యూషన్స్‌తో సబ్ కాంట్రాక్టు తీసుకున్నప్పటికీ ఆయా నిధులు మరో సంస్థకు మళ్ళించారని ఆపరేటర్ సాత్విక్ విమర్శించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో తాము ఫిర్యాదు చేశామని సాత్విక్ తెలిపారు.

ఫండ్స్ విడుదల కాలేదు: ఏఎంసీ శ్రవణ్ కుమార్ రెడ్డి

డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇవ్వాల్సిన నిధులు జీహెచ్ఎంసీ పరిధిలోని ఏ సర్కిల్‌కు కూడా మంజూరు కాలేదని శేరిలింగంపల్లి ఏఎంసీ శ్రవణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. కాంట్రాక్టు పొందిన ఏజెన్సీ ద్వారానే ఆయా ఆపరేటర్ల అకౌంట్లలో నిధులు జమ చేస్తారని తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఐడీలు క్రియేట్ చేశామని వారికివ్వాల్సిన నిధులు వారి అకౌంట్లలో జమవుతాయని తెలిపారు.